నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
8 | శనివారం 24 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కౌటాల– సిర్పూర్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

# తడిసిన ధాన్యం కొనాలి

- ముత్తంపేట రైతుల డిమాండ్
- కౌటాల-సిర్పూర్ ప్రధాన రహదారిపై మూడు గంటల పాటు రాస్తారోకో
- భారీ సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు
- మద్దతు తెలిపిన సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు
- పారిగాంలోనూ ధర్నా
- అదనపు కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

కౌటాల, మే 23 : ప్రభుత్వం కొనుగోళ్లలో జాప్యం చేయడం వల్ల అకాల వర్షానికి వడ్లు తడిసిపోయాయని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్తంపేట, సిర్పూర్(టీ) పారిగాం కొనుగోలు కేంద్రాల వద్ద రాస్తారోకో నిర్వహించారు. ముత్తంపేట లోని కౌటాల–సిర్పూర్ ప్రధాన రహదారిపై ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ధర్నా చేయడంతో ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. వడ్లు అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వస్తే పొల్లు, తేమ శాతం ఉందని సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఇలా వర్షపు నీటి పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అక్కడికి చేరుకుని రైతులకు మద్దతుగా రాస్తారోకోలో కూర్చున్నారు. రైతు కష్టాల గురించి కలెక్టర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అదనపు కలెక్టర్ డేవిడ్ పారిగాం, ముత్తంపేట వరి కొనుగోలు కేంద్రాల వద్దకు చేరుకుని తడిసిన వడ్లను పరిశీలించారు. వారంలోగా వరి ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వం తరుపున కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, ఇతర పార్టీల నాయకులు రైతులకు మద్దతు పలికారు.



315లోని భూమి పట్టాదారుడు ఎవరో తేల్చి చెబుతూ తహసీల్దార్ ఇచ్చిన డిక్లరేషన్

కబ్జా చేసి రేకులను అడ్డంగా పెట్టిన సర్వే నంబర్ 315లోని భూమి

కబ్జాకు గురైన సర్వే నంబర్ 315లోని భూమి

# కన్నేసి.. కబ్జా చేసి!

## గర్మిళ్ల శివారులోగల సర్వే నం.315లోని భూమిలో పాగా వేసిన ఓ సామాజిక వర్గం పెద్దలు

- ఎమ్మెల్యే అనుచరులమంటూ పట్టాదారుడికి బెదిరింపులు
- అన్యాయంగా చొరబడి తాళాలు పగులగొట్టిన ప్రబుద్ధులు
- బాధితుడు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- తప్పుడు ఫిర్యాదు మేరకు తిరిగి బాధితుడిపైనే కేసు
- నా వద్ద రెవెన్యూ రికార్డులన్నీ ఉన్నాయి.. ఎక్కడికైనా వచ్చి నిరూపించడానికి సిద్ధం : మల్లారెడ్డి
- ఇప్పటికైనా న్యాయం చేయాలని వేడుకోలు

మంచిర్యాల, మే 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా గర్మిళ్ల శివారులోని సర్వే నం. 315లోని ఓ పట్టా భూమిపై స్థానిక ప్రజాప్రతినిధి సామాజిక వర్గ పెద్దల కన్ను పడింది. ఎమ్మెల్యే అనుచరులమని చెప్పుకుంటూ పట్టాదారుడిని భయభ్రాంతులకు గురి చేస్తూ ఆ భూమిలోకి చొరబడగా, ఈ విషయంపై బాధితుడి పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. అన్ని డాక్యుమెంట్లు చూపించినా, తహసీల్దార్ సైతం ఆ భూమి పట్టాదారుకు చెందినదే అని తేల్చి చెప్పినా ప్రయోజనం లేదు. పైగా పట్టాదారు కేసు పెట్టిన మరుసటి రోజే.. ఆక్రమణదారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరిగి పట్టాదారుపైనే కేసు నమోదు చేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కేసు పెట్టి ఏడు నెలలు గడిచిపోతున్నా.. కాలయాపన చేస్తూ ఆక్రమణదారులకే అధికారులు సహకరిస్తున్నారంటూ బాధితుడు వాపోతున్నాడు. 20 ఏండ్ల క్రితం భూమి కొనుగోలు చేసిన నాటి నుంచి ఇంటి పన్ను, నల్లా పన్ను, వెకెట్ ల్యాండ్ ట్యాక్స్, కరెంట్ బిల్లులు కడుతూ వస్తున్నానని పట్టాదారు పూదరి మల్లాగౌడ్ చెబుతున్నారు. పట్టాదారు నుంచి తాను కొనుగోలు చేసిన డాక్యుమెంట్లు అన్నీ ఉన్నాయని, కబ్జా చేసిన వారి దగ్గర ఏం డాక్యుమెంట్లు ఉన్నాయో పట్టుకొని రావాలంటూ సవాల్ చేస్తున్నారు. అసలు సర్వే నం.315లోని భూమి ఎవరిది.. కబ్జాకు ప్రయత్నిస్తున్న ఆ సామాజిక వర్గ పెద్దలు ఎవరు.. ఏం జరిగింది.. పోలీసులు ఏకపక్షంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు.. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

### రెవెన్యూ రికార్డుల్లో ఏం ఉంది..

గర్మిళ్ల శివారులోని సర్వే నం.315లో రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే సేత్వార్ ప్రకారం 315/అ సర్వే నంబర్‌లో ఆకుల నారాయణ పట్టేదారుగా ఉన్నారు. 1954 కాస్రా పహణీ ప్రకారం ఈ సర్వే నంబర్‌లో ఆకుల నారాయణకు రెండు ఎకరాల 34 గుంటలు ఉంది. ఈ సర్వే నంబర్‌లో 26–367,26–368 ఇంటి నంబర్లతో రెండు ఇండ్లు సైతం ఉన్నాయి. ఈ ఇండ్లు దాదాపు 120 సంవత్సరాలుగా ఉంటున్నాయి. 315/అ సర్వే నంబర్‌లో ఎకరంపావు 6,665 గజాల భూమిన ఆకుల నారాయణ వారసులు 2007లో పూదరి కళావతి (పట్టాదారు పూదరి మల్లాగౌడ్) భార్యకు విక్రయించారు. ఈ మేరకు డాక్యుమెంట్ నంబర్లు 7749/2007, 8380/2007 ద్వారా సేల్ డీడ్ సైతం చేసుకున్నారు. అదే భూమిని 865/2015, 4153/2018 ద్వారా పూదరి మల్లాగౌడ్ జీపీఏ చేసుకున్నారు. ఆ భూమిలోని రెండు ఇండ్లను సైతం తన పేరు మీదకు మార్చుకున్నారు. 20 ఏండ్లుగా అక్కడే ఉంటూ మున్సిపాలిటీకి ప్రాపర్టీ ట్యాక్స్, వెకెట్ ల్యాండ్ ట్యాక్స్, నల్లా పన్ను, రెండు ఇండ్లకు కరెంట్ బిల్లులు కూడా కడుతూ వస్తున్నారు. రెవెన్యూ రికార్డు, మున్సిపాల్ రికార్డులు ఏం చూసుకున్నా ఇది స్పష్టంగా తెలిసిపోతున్నది.

### దౌర్జన్యంగా భూమిలోకి చొరబాటు..

ఈ క్రమంలో 2024 నవంబర్ 8న మధ్యాహ్నం 12.45 జీవీ ప్రశాంత్‌రావు అనే వ్యక్తి పది నుంచి పదిహేను మందితో ఓ జేసీబీ, తార్ వాహనంలో వచ్చి 315/అలో మల్లాగౌడ్‌కు సంబంధించిన భూమి మెయిన్ గేట్ తాళాలు పగులగొట్టి దౌర్జన్యంగా లోపలికి ప్రవేశించాడు. జేసీబీతో భూమి లోపల మొత్తం చదును చేయడం మొదలుపెట్టారు. దీనిపై పట్టాదారు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ తిరిగి మల్లాగౌడ్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలానికి వెళ్లి తిరిగి కాల్ చేస్తానని చెప్పాడు. కానీ గంట సమయం గడిచిన ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితుడు మంచిర్యాల ఏసీపీ, సీఐలకు వాట్సాప్ మేసేజ్, టెక్ట్ మెసేజ్ పెట్టి ఇద్దరి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఏవైనా డాక్యుమెంట్లు ఉంటే సాయంత్రం వచ్చి కలవమని ఏసీపీ, సీఐ చెప్పడంతో వారి సూచనల మేరకు వెళ్లి కలిశాడు. ఆయన డాక్యుమెంట్లు పరిశీలించిన అ నంతరం అధికారులకు ఇప్పటికీ జేసీబీ తన భూమిలోనే పని చేస్తుందని, ఆ మిషన్‌ను కస్టడీలోకి తీసుకొని ఎఫ్ఐఆర్ చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియాలు, వాహనాల నంబర్లు.. ఇలా అన్ని ఆధారాలు పోలీసులకు సమర్పించారు. దీంతో అర్ధరాత్రి 12.30 గంటలకు మల్లాగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు జేసీబీ, తార్ వాహనాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇది చేస్తున్నది ప్రశాంత్‌రావు అని.. తెల్లారి ఆయన్ని పిలిస్తామమని, నువ్వు కూడా రావాలని చెప్పారు. ఈ మేరకు బాధితుడు ఉదయాన్నే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా మల్లాగౌడ్ డాక్యుమెంట్లను మరోసారి పరిశీలించిన పోలీసులు ప్రశాంత్‌రావును డాక్యుమెంట్లు చూపించాలని కోరారు. కానీ ఆయన దగ్గర ఎలాంటి డాక్యుమెంట్లు లేకపోవడంతో ఎఫ్ఐఆర్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ డాక్యుమెంట్లను తహసీల్దార్ ఒపీనియన్ కోసం పంపిస్తామని చెప్పారు.

### బాధితుడిపైనే ఉల్టా కేసు..

ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. బాధితుడు మల్లాగౌడ్ దౌర్జన్యంగా వచ్చి మెయిన్ గేట్ తాళాలు పగలగొట్టి సర్వే నంబర్ 315/బీలోని తన భూమిలోకి వచ్చాడంటూ ప్రశాంత్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బాధితుడిపైనే ఉల్టాకేసు నమోదు చేయడం కొసమెరుపు. ఒకరోజు ముందే మల్లాగౌడ్ పోలీసులు ఫిర్యాదు చేయగా, మరుసటి రోజు 9న బాధితుడిపైనే కేసు నమోదు చేశారు. 8న మధ్యాహ్నం 12.45 గంటలకు ప్రశాంత్‌రావు తాళాలు పగలగొట్టి దౌర్జన్యంగా తన భూమిలోకి వచ్చాడని పట్టాదారు ఫిర్యాదు చేస్తే, 9న ప్రశాంత్‌రావు 8న సాయంత్రం 4 గంటలకు మల్లాగౌడ్ వచ్చి తాళాలు పగలగొట్టినట్లు ఫిర్యాదు చేశారు. మల్లాగౌడ్ 100కు ఫోన్ చేయడం, పోలీసులు ఆధారాలన్నీ సమర్పించడం చేసినా.. ఉల్టా ఆయనపైనే కేసు ఎందుకు నమోదు చేశారన్నది అర్థం కాకుండా పోయింది. పైగా ప్రశాంత్‌రావు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న గర్మిళ్ల శివారులో సర్వే నం. 315/బీ అనేది అసలు రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా లేదు. తహసీల్దార్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. సర్వే నంబర్ 315/అలో సేత్వార్, కాస్రా పహణీలో 2.34 గుంటలకు ఆకుల నారాయణ పట్టాదారుగా ఉన్నారని తేల్చిచెప్పారు. ఆయన నుంచి ఆ భూమి మల్లాగౌడ్‌కు వెళ్లింది. రికార్డుల్లోనూ ఇదే ఉంది. కానీ పోలీసులు మాత్రం బాధితుడిపై కేసు నమోదు చేయడం.. తహసీల్దార్ డిక్లరేషన్ ఇచ్చినా మల్లాగౌడ్‌పై కేసును కొట్టివేయకపోవడం ఎన్నో అనుమానాలకు తావిస్తున్నది. ఈ వ్యవహారంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలకు ఇవన్నీ బలం చేకూరుస్తున్నాయి.

### ఎమ్మెల్యే అనుచరులు పనేనా..

ఈ వ్యవహారంలో పట్టాదారును ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరు బాధితుడిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరిస్తున్నట్లు సమాచారం. కాకపోతే నిజంగానే ఈ వ్యవహారం వెనుక ఎమ్మెల్యే ఉన్నారా లేదా అనే విషయంలో స్పష్టత లేదు. కాకపోతే ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడిగా ఉండే ఓ సారు ఈ వ్యవహారాన్ని ముందు ఉండి నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన ఒత్తిడి మేరకు పోలీసులు ఏం చేయలేకపోతున్నారని తెలుస్తున్నది. ఎవరున్నా సరే పట్టాభూమిని కబ్జా చేయాలని చూడడం అన్యాయమని స్థానికులు అంటున్నారు. ఒకవేళ నిజంగా ఎమ్మెల్యే లేకపోతే ఈ విషయంలో బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే ఎలా స్పందిస్తారు. ఏడు నెలలుగా కేసును ఎటూ తేల్చని పోలీసులు బాధితుడికి న్యాయం చేస్తారా.. లేదా అన్నది వేచి చూడాల్సి ఉన్నది.

### ❖ నిరూపించడానికి సిద్ధం..

*గర్మిళ్ల శివారులోని సర్వేనం.315/అలోని భూమి నాది. ఇది ఎక్కడికైనా వచ్చి నిరూపించడానికి నేను సిద్ధం. రెవెన్యూ రికార్డులు, నా డాక్యుమెంట్లు అన్ని ఉన్నాయి. పోలీసులకు సైతం అవి సమర్పించాను. తహసీల్దార్ కూడా ఆ విషయాన్ని తేల్చి చెప్పారు. కానీ ఏడు నెలలుగా ఈ కేసును ఎందుకు పెండింగ్ పెడుతున్నారో అర్థం కావడం లేదు. సీపీ అంబర్ కిషోర్ ఝా బాధ్యతలు చేపట్టాక వెళ్లి కలిశాను. సార్ సీరియస్‌గా చెప్పినా ఫలితం లేదు. ఒకవేళ ప్రశాంత్‌రావు ఏమైనా డాక్యుమెంట్లు ఉంటే చూపించమనండి. అసలు ఆయన చెప్పిన సర్వేనంబర్ 315/బీ రెవెన్యూ రికార్డుల్లోనే లేదు. నేను కేసు పెట్టినప్పుడు ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు అన్ని ఆధారాలు సమర్పించా. మరి ప్రశాంత్‌రావు ఏం సమర్పించారో చెప్పాలి. నాపై పెట్టింది తప్పుడు కేసు అని పోలీసులకు సైతం తెలుసు. కానీ ఉద్దేశ పూర్వకంగానే కాలయాపన చేస్తున్నారు. నాది తప్పైతే నన్ను అరెస్టు చేయాలి. అదే ప్రశాంత్‌రావుది తప్పైతే ఆయన్ని అరెస్టు చేయాలి. కానీ ఏడు నెలలు అవుతున్నా ఎందుకు ఆపుతున్నారో పోలీసులే సమాధానం చెప్పాలి. సీపీసార్, ఎమ్మెల్యే సార్ నాకు న్యాయం కావాలి. నా తప్పు ఉంటే నన్ను లోపల వేయండి. లేకపోతే నన్ను ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోండి. ఏడు నెలలుగా ఎదురు చూసి న్యాయం జరగకపోవడంతో మీడియాను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇప్పటికైనా నాకు న్యాయం చేయాలి.* **- మల్లాగౌడ్, బాధితుడు**

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కాగజ్‌నగర్, మే 23 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని స్టాక్, బిల్లుల బుక్, రిజిష్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. దుకాణాల్లో అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. డీఏవో శ్రీనివాస రావు, ఏడీఏ మనోహర్, ఏవో రామకృష్ణ ఉన్నారు.

మాట్లాడుతున్న జేఏసీ ప్రణాళిక చైర్మన్ ముఖేశ్‌గౌడ్

## ఆకలి కేక మహాసభను విజయవంతం చేయాలి

- రాష్ట్ర ఆటో జేఏసీ ప్రణాళిక చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్

మంచిర్యాల అర్బన్, మే 23 : ఈ నెల 27న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆటో డ్రైవర్ల ఆకలి కేక మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఆటో జేఏసీ ప్రణాళిక చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆటో యూనియన్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చి మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్ల బతుకులు వీధినపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికుల ఆకలి కేక యాత్రను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 27న ఇందిరాపార్క్ వద్ద సభ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్లు, కార్మికులు, నాయకులు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు ప్రతినెలా రూ.12 వేలు చెల్లించాలని, ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేకంగా రూ.1000 కోట్లు, ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులు సహజ మరణం చెందితే రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బెల్లంకొండ మురళీధర్, పొట్ట మధుకర్, కల్వల అంజయ్య, పగడాల రాజేశ్, ఎండీ షఫీ, తగరం శ్రీనివాస్, మంతెనగట్టయ్య, శేఖర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## పులిని చంపిన కేసులో 16 మందికి రిమాండ్

- ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలింపు

నిందితులతో ఫారెస్ట్ అధికారులు

ఆసిఫాబాద్ టౌన్/పెంచికల్‌పేట్, మే 23 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు అటవీ ప్రాంతంలో ఈ నెల 15న విద్యుత్ తీగలు అమర్చి పులిని హతమార్చిన కేసులు 16 మందిని రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ తెలిపారు. పెంచికలపేట రేంజ్ పరిధిలో కే–8 పులిని కొంతమంది వేటగాళ్లు చంపి పాతి పెట్టగా, అనుమానితుడైన ఎల్లూరు గ్రామానికి చెందిన అపాచీ శ్రీనివాస్(ఏ1)ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ తర్వాత మిగతా నిందితులను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరిని సిర్పూర్ కోర్టు ప్రస్తుత ఇన్‌చార్జి జిల్లా జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి ఎదుట శుక్రవారం ఉదయం ప్రవేశపెట్టగా నిందితులకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. అప్పాజీ శ్రీనివాస్, అప్పాజీ వెంకటేశ్, ఎల్కర్ శేఖర్, రోహిణి శ్రావణ్, చాపిడే అశోక్, చాపిడే పవన్‌కుమార్, ఎల్కరి ప్రకాశ్, బుర్రి వెంకటేశ్, కాటేల సాగర్, నికాడి వెంకటేశ్, లాటూకరి శ్రీనివాస్, భీంకరి వెంకటేశ్, బింకరి రంగయ్య, లేగల గోపాల్, రాచకొండ లచ్చయ్య, ఓంద్రె సంతోష్‌లను ఆసిఫాబాద్ సబ్ జైలులో అప్పగించినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. మరో 14 మందిని అదుపులో ఉంచుకొని విచారణ కొనసాగిస్తున్నారని, వారికి కూడా త్వరలోనే రిమాండ్‌కు తరలించేఅవకాశాలున్నాయని వారు పేర్కొన్నారు.

మృతి చెందిన బోయర్ లక్ష్మి(ఫైల్), షెండే హన్సిక(ఫైల్)

## ఆడుకుంటూ.. ఆరుబయటకెళ్లి..

- నీటి కుంటలో మునిగి ఇద్దరు చిన్నారుల మృత్యువాత
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు, బంధువులు

కౌటాల, మే 23 : ఆడుకుంటూ ఆరుబయటకు బహిర్భూమికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీటి కుంటలో మునిగి మృత్యువాత పడ్డారు. ఈ ఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తాటిపల్లిలో శుక్రవారం జరిగింది. తాటిపల్లికి చెందిన స్నేహితులు బోయర్ లక్ష్మి(13), షెండే హన్సిక(11), కవిత, హవి ఆడుకుంటూ ఊరు బయట చేనులోకి బహిర్భూమికి వెళ్లారు. పక్కనే ఉన్న కుంటలో తేలుతూ వాటర్ బాటిల్ కనిపించింది. దానిలో నీటిని తెచ్చేందుకు బోయర్ లక్ష్మి, షెండే హన్సి కుంటలోకి దిగారు. నీటిపై తేలి ఉన్న బాటిల్‌ను అందుకునేందుకు లక్ష్మి ప్రయత్నం చేస్తుండగా, కాలు జారి అందులో పడింది. లక్ష్మిని కాపాడేందుకు హన్సి క చేయి అందిస్తూ ఆమె కూడా కుంటలో పడి పోయింది. పైన ఉండి గమనిస్తున్న కవిత, హవి వెంటనే ఊరిలోకి వెళ్లి కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు విషయం తెలిపారు. వారు అక్కడికి చేరుకునే సరికే చిన్నారులిద్దరూ నీట ము నిగి మృతి చెందారు. వారి మృతదేహాలను బయటకు తీశారు. విగతజీవులుగా మారిన త మ పిల్లలను చూసి తల్లిదండ్రులు క న్నీరుమున్నీరయ్యారు. వారిలో ఒకరు తాటిపల్లికి చెందిన బోయర్ విశ్వనాథ్ కూతురు లక్ష్మి కాగా, మరొకరు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఎట్టపల్లి గ్రామానికి చెందిన షెండే రత్నమాల–విజయ్‌ల కూతురు హన్సిక. వేసవి సెలవుల కోసం తాటిపల్లిలోని మేనత్త ఇంటికి పది రోజుల క్రితం వచ్చింది. మాజీ ఎమ్మెల్యే కోనప్ప ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం అంబులెన్స్ తెప్పించి మృతదేహాలను సిర్పూర్(టీ) సివిల్ దవాఖానకు పంపించారు. ఎస్ఐ విజయ్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

శుక్రవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనం

## వృద్ధ దంపతులకు రేషన్ కార్డు ఇప్పిస్తాం

- కాసిపేట తహసీల్దార్ భోజన్న

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

కాసిపేట, మే 23 : కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామ పంచాయతీలోని గుండ్లపాడ్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు మడావి భీము–అంబుబాయి రేషన్ కార్డు కోసం నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతుండగా, శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'రేషన్ కార్డు ఇప్పించారూ..' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు తహసీల్దార్ భోజన్న స్పందించారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేసి, వృద్ధుడికి రేషన్ కార్డు అందించేలా చూస్తామని ఆయన తెలిపారు.